
# తోడేళ్ళ మధ్య




"అదిగో సరిగ్గా అక్కడికి...." అన్నాడు రామారావు.

అక్కడో పాక. పాకముందు విశాలంగా ఆవరణ, ఆవరణకి అంచున పచ్చగా మొక్కలకంచె. కంచెలేని చోట అడుగున్నర ఎత్తున కుప్పగా పోసిన కొండరాళ్ళు.... పాకముందు ఆవరణంతా జేగురు రంగుతో అలకటంతో మొక్కలమీంచి ఎర్రగా కనిపిస్తోంది.

"అక్కడికే రోజూ సాయంత్రం ఈ ఊళ్ళో దెయ్యాలన్నీ వచ్చేవి... చిన్నవి, పెద్దవి... ఆడవి, మగవి... కండలు దిట్టంగా ఉన్న పడుచువి, చర్మం వేళ్ళాడే ముసలివి.... అన్నీ వచ్చేవి. ఏడాదిన్నరగా చూస్తూనే ఉన్నాను. అలా రావటం.... ఆ హడావుడి, రోజూ సాయంత్రం ఇక్కడ కూచుంటే సరిగ్గా ఆ వీధి చివర నుంచి కనిపిస్తాయి."

వీధి చివర నుంచి ఏదో ఆకారం వస్తోంది. నెమ్మదిగా ఉంది ఆ కదలిక. సాయంచీకట్లు కమ్ముకోటంతో మరీ అస్పష్టంగా ఉంది. ఎదురుగా ఉన్న పాకకి వెనగ్గా పెద్ద కొండ ఉండటం వల్ల ఆ వీధి మరీ తొందరగా చీకట్లో మునిగింది. చూస్తుండగా.... అలా కదుల్తూ ఆ ఆకారం బాగా దగ్గరికి వచ్చాక తెలిసింది నడివయసు మనిషిలా. సామాన్యపు మనిషి.... పొడుక్కి తగ్గట్టు వొళ్ళులేదు. కంచె దగ్గర ఆగి కాస్సేపు పాకవేపు చూసి మళ్ళీ వెళ్ళిపోయాడు.

"ఆ తాగుడు దెయ్యాల్లోదే ఇదీనూ...." అన్నాడు రామారావు వాడివేపే చూస్తూ.

ఆవరణవేపు మరీ పరీక్షగా చూస్తే అక్కడక్కడ చీకట్లో చెదురుగా మట్టి ముంతలున్నాయి.

"ఆ పాకలోనే తనుండేది" అన్నాడు పాకవేపు చూపిస్తూ తిరిగి రామారావు.

"పేరు పున్ని.... గమ్మత్తుగా ఉంది కదూ. అసలు పేరు పున్నమ్మ. కాని అందరూ పున్ని అనేవారు. ఎలా ఉండేదో తెలుసా.... నల్ల గులాబీలా ఉండేది. ఆ నల్లటి వొంటితో చూపుకి నిండుగా వుండేది. వెన్నోల్లో మెరుస్తూ ..... చలాకీగా గంతులేస్తూ కుందేల్లా తిరిగేది.... గలగలా మాట్లాడేది...." రామారావు కొంచం మందుపట్టులో ఉన్నాడు. గొంతు మంచి హుషారుగా ఉంది.

"ముడి చుట్టుకోకుండా.... విరబోసిన జుట్టుతో తను అటూ, ఇటూ తిరుగుతుంటే గొప్ప అందం తిరుగుతున్నట్టుండేది. దేవతలా, అప్సరసలా ఉందనను. మనుషుల్లో.... నిజమని నమ్మించే అందం ఉండేది తనలో. ఒక్కోసారి.... తనని చూస్తుంటే అస్తమానం చూడాలనీ, తనమీద కొన్ని క్షణాలేనా నాది అనే హక్కు కావాలనీ అనిపించేది. మరి కాస్సేపు..... అందంగా అలాంటి చెల్లెలు ఇంట్లో తిరుగుతుంటే బాగుండు ననిపించేది. తను ఆరోగ్యమైన పిల్లల్ని కని వాళ్లతో ఆడుకుంటుంటే చూడాలనిపించేది.

అసలు ఇది చెపుతూ నీకు పున్ని గురించి చెప్పకూడదనుకున్నాను. ఆమె గురించి సరిగ్గా ఏం చెప్పాలో తెలియదు. ఇప్పుడు లేదు.... ఉంటే చూపించేవాణ్ణి...." అన్నాడు రామారావు.

కాస్సేపు ఆగాడు.... పాకవేపు చూస్తూ....

"ఆర్నెల్లక్రితం వరకు వీళ్ళన్నయ్యుండేవాడు.... భూమయ్య, ఎలుగ్గొడ్డులా ఉండేవాడు. పెద్ద కల్లుబానని అమాంతంగా ఎత్తి దింపుతూ ఉండేవాడు. ఈ దెయ్యాలందరితో వాడే చేసేవాడు వ్యాపారం. ముందు నాకా దృష్టిలేదు. కాని ఈమధ్య తట్టింది. పున్నివేపు ఎవడూ ఎందుకు కన్నెత్తి చూసేవాడు కాదో.... వాడి భయంవల్లే.... వాడు "దొరా, దణ్ణం" అన్నా భయంగానే ఉండేది.

'ఒంటరిగా ఈ పల్లెటూళ్ళో ఎలా అఘోరిస్తున్నావురా' అంటే ఏవేవో చెప్పుకొస్తున్నాడు రామారావు. వీడికి నా అన్నవాళ్లులేక, తలతిక్క ఎక్కి పెళ్ళి చేసుకోక, ఇలా మందు సేవిస్తూ పల్లెటూళ్ళో వి.ఎల్.డబ్ల్యు ఉద్యోగం వెలగబెడుతూ తిరుగుతున్నాడు. ఇంతకీ వాడు చెప్పేదేమిటో వాడికేనా తెలుస్తోందో లేదో....

"చెప్పేది విను. నేను బాగానే ఉన్నాలే... ఎక్కడివరకు చెప్పా... అదే భూమయ్య కదూ. వాడు ఆర్నెల్ల క్రితం ఠపీమని చచ్చాడు. దుక్కలాంటి మనిషి ఎలా చచ్చాడో మరి...

ఒకటి, రెండు వారాలు తాగుడికి ఎవరూ రాలే.... ఆ తర్వాత వో సాయంత్రం హడావిడి అంతా మామూలుగానే మొదలైంది. సోది కబుర్లు చెప్పుకుంటూ, ఆకుచుట్టలు కాల్చుకుంటూ..... తూలుతూ, సోలుతూ గుంపులు గుంపులుగా తాగుతున్న వాళ్ళందరికీ పున్నే పోస్తోంది.... డబ్బు తీసుకుంటోంది.

రోజూ సాయంత్రం చూట్టమే నా పని. ఇదివరకు గుంపుని గోలగా అసహ్యంగా చూసేవాణ్ణి... పున్ని అలా మధ్యమధ్యలో తిరుగుతూ వుంటే ఆ రోజు నుంచి కొంచం ఆసక్తిగా చూసేవాణ్ణి. ఇదివరకు

ఈ దెయ్యాలకి వాళ్ళ గొడవ వాళ్ళకే కాని ఎదుటివాళ్ళ గొడవ ఉండేది కాదు. వాడెవడో మత్తెక్కిపోయి ఓరోజు అరిచాడు.

"నీ అక్క... నువ్వు పోస్తా ఉంటే పున్నీ... మజాగా ఉందే" అని.

భూమయ్యుండగా ఎవడూ ఇలా కూసేవాడు కాదు. మగాడి రక్షణలేని ఆడదాని మీద అలుసు ఎక్కువుంటుంది. ఇంక పున్ని ఏం చేస్తుందో?... అనిపించింది. ఎవణ్ణో ఈ ఎలుగ్గొడ్డుగాళ్ళలో, ఒకణ్ణి పెళ్ళాడి.... వాడు రాళ్ళని చితక్కొట్టినట్టే....తాగి తననీ చితక్కొడితే ఏడ్చి, వాడికి హుషారుగా ఉన్నప్పుడు ఉబ్బేస్తే.... ఆ క్షణాలే స్వర్గంగా వాడితోపాటు తాగి.... మళ్ళీవాడు మామూలు బతుకులో పడినప్పుడు తంతుంటే.... పెంపుడు గొడ్డులా బతికేస్తుందా.... అనిపించింది."

రామారావు పున్ని గురించి అలా చెపుతుంటే ఆ నలుపు వొంటి అందం చూస్తే బాగుండు ననిపిస్తోంది. నల్లటి ముఖంలో వెడల్పుగా కళ్ళు.... కణతల్ని, చెవుల్ని కప్పేస్తూ జుట్టూ... అమాయకంగా కదిలే చిన్న పెదాలు. ఇదంతా రూపకల్పనగా జరుగుతోంది నా కళ్ళముందు.

"నువ్వు చూళ్ళేదు కాని... పున్ని అలా అవుతుందనుకుంటే నాకే కాదు ఎవరికేనా బాధగానే ఉంటుంది. ఇక్కడ చుట్టుపక్కల ఇళ్ళ వాళ్లందరికీ ఇదే వృత్తి. అంతా వడ్డాళ్ళే.... పొద్దున్నే లేస్తారు. జొన్నరొట్టెలు మూట కట్టుకుని కొండలమీదకి పోతారు. ఆడ, మగ, పన్నెండేళ్ల పైబడ్డ పిల్లలూ సాయంత్రం కాగానే కడుపునిండా తాగుతారు. రాళ్ళకి, మనుషులకి తేడా వాళ్ళ దృష్టిలో చాలా స్వల్పం. కొంచం కోపం వచ్చినా, పెళ్ళాల్ని గొడ్డులా కొట్టటం వీళ్ళకి మామూలే. తన్నులు తింటం ఈ ఆడాళ్ళకీ అలవాటే. కాని చూట్టం అలవాటు లేక మనకే బాధ. వీళ్ళ తిండి తెలుసా.... మనింటి వెనకాల ఓ పచ్చుడిబండ ఉంది. రోజూ చూస్తాను. పొద్దున్నే ఓ కుఱ్ఱ వెధవొస్తాడు చూడు. నాలుగు ఎండు మిరపకాయలు, కొంచం చింతపండు.... ఓ ఉల్లిపాయ, కాస్త ఉప్పు కలిపి నూరుకుపోతాడు. అదీ, జొన్నరొట్టె వాళ్ళ తిండి. అంచనావేసి చూస్తే వాళ్ళపూట తిండి పావలా ఖరీదు చెయ్యదు. కాని రోజూ అర్థరూపాయి పెట్టేనా ప్రతివాడు తాగుతాడు. లేకపోతే పనిసాగదు. మళ్ళీ మర్నాటికి వొళ్ళు కదలదు. తాగి తాగి రాత్రంతా సొమ్మసిల్లి పడుకుంటారు. రోజుకి, రోజుకీ మధ్య తాగుతున్న సమయమే వాళ్ళకి కాస్త సరదా బతుకు. జీవితాన్ని, మొగుడు పెళ్ళాలు ఆప్యాయంగా మసిలే దగ్గరితనాన్ని తెలుసుకునే సమయం లేదు వీళ్ళకి.

మరి భూమయ్యకి ఎలా అబ్బిందో ఈ తెలివి. వ్యాపారం చేసేవాడు... పగలంతా ఎక్కడెక్కడో తిరిగేవాడు. సాయంత్రం మటుకు పాకలోనే ఉండేవాడు. రోజూ రెండు గంటల పని... హాయిగా ఉండేది వాడి జీవితం.

వాడు పోయింతర్వాత, పున్నికి తెలిసిన జీవితం ఇదొక్కటే... అందుకని అదే చేసింది. బాగానే జరిగేది. కాని ఓసారి గొడవైంది."

రామారావు మళ్ళీ కాస్సేపు ఆగాడు. అలుపు వచ్చిందో, గుర్తు తెచ్చుకుంటున్నాడో.

"సరిగ్గా పొద్దున్నే.... ఇంకా నేను నిద్దర లేవలేదు... మత్తుగా ఇలాగే పడుకున్నా అరుగుమీద. మనుషుల గొడవకి లేచాను. పున్ని పాకముందు నిలబడి ఉంది. ఇద్దరు పోలీసులున్నారు. అంతకుముందు గట్టిగానే ఏడ్చిందేమో కాని, అప్పుడు మటుకు ఏడవటంలేదు. విషయం కనుక్కుంటే తెలిసిందేమిటంటే,

రాత్రి మత్తుగా తాగి వెళ్ళిన వాళ్ళల్లో పదిమంది అమాంతంగా చచ్చారని, అందుకు పున్నిని అరెస్టు చేస్తున్నారని... కేసు విషయాలు తెలుసుకునే లోపలే పున్నిని తీసుకెళ్ళిపోయారు.

ఆరోజు మా ఆఫీసరి ఇనస్పెక్షను అది పూర్తయ్యేటప్పటికి చీకటి పడింది..... బస్సుల్లేవు. బోధన్ వెళ్ళాలంటే... పున్నిని బోధన్ పోలీస్‌స్టేషన్‌కి తీసికెళ్ళారని తెలిసింది.

తెల్లారగానే వెడదామనుకుంటే, పొద్దున్నే పాకలో తనే కనిపించింది. అడిగితే కేస్ పెడతామన్నారని... వాళ్ళ మామ పటేలు జామీనిచ్చి విడిపించేడని..... రాత్రంతా వాళ్లింటి దగ్గరే ఉన్నానని చెప్పింది.

అమ్మకానికి కావల్సిన సరుకు... కల్లు... కల్తీసరుకు గుడంబా అంతా పక్క ఊళ్ళో ఉన్న బట్టీలోంచే వచ్చేవని, గుడంబా తాగితే ఇలా మనుషులు చచ్చిపోవటానికి అవకాశం ఉంటుందని తనకి తెలియదని, ఇంకో దారి లేక కాని, ఉంటే ఈ వ్యాపారం ఇకముందు చెయ్యనని కూడా చెప్పింది.

ఆ తర్వాత కొంచం కొంచం అమ్మినా, ఇంచుమించు మానేసిందనే చెప్పాలి. కోర్టులో కేసున్నప్పుడల్లా నిజామాబాద్ వెళ్ళొచ్చేది."

సిగరెట్ వెలిగించుకోటానికి ఆగాడు రామారావు.

"నువ్వూ వో సిగరెట్టు తగలేస్తావా?" అన్నాడు సిగరెట్టిస్తూ.... ఇంటరెస్టింగ్‌గా ఉండటంవల్ల మాట్లాడకుండా అందుకుని వెలిగించాను.

"అంతకుముందు ఒకటి రెండుసార్లు పక్కనున్న పల్లెలకి బళ్ళమీద వెళ్ళటం తప్ప ఎప్పుడూ పెద్ద ఊళ్ళు వెళ్ళలేదు పున్ని. నిజామాబాద్ వెళ్ళి వొచ్చినప్పుడల్లా చాలా చెప్పేది. అరుగు మీద సాయంత్రం ఇలాగే కూర్చునేవాణ్ణి. కంచె దగ్గర నిలబడి చెపుతుండేది. తనకి పట్టణం కన్నా, కోర్టు... ఆ వాతావరణం... ఆ పద్ధతి, అందులో కోట్లు... క(రబోన్లు చాలా చిత్రంగా అనిపించాయని చెప్పింది మొదటిసారి. అలా చెపుతూనే ఓసారి...

"దొరా.... ఎన్ని నేరాలో ఈ లోకంలా...." అంది.

ప్రపంచంలో నేరం అన్నదే చాలా అరుదుగా జరుగుతుందని, నేరం అని తెలిస్తే ఎవ్వరూ దాన్ని చెయ్యరని తన ఉద్దేశం. అలాంటిది అక్కడ కోర్టులో అనేక రకాల నేరాలుంటాయని తెలిసేటప్పటికి చిత్రంగా తోచి అస్తమానం అదే చెప్పేది.

ముద్దుగా తియ్యటి పిట్టలా మాట్లాడేది. నాక్కొదేనా నవ్వొచ్చి నవ్వితే గబుక్కుని మూతి ముడుచుకునేది. కోర్టులో వాయిదా కెళ్ళి వచ్చిన సాయంత్రం కంచ దగ్గరే తారట్లాడుతుండేది నేనొచ్చేవరకు. అక్కడ జరిగినవన్నీ చెప్పేవరకూ తృప్తి ఉండేది కాదు తనకి.

బోనులో నిలబడ్డ జనం తనని చూస్తుంటే ఎలా అనిపించిందో, తికమకగా అడిగే ప్రశ్నలకి తను ఎలా సమాధానం చెప్పిందో అన్నీ చెప్పేది. ప్రతీది పెద్ద విషయంలాగే ఉండేది తనకి.

"ఆ నల్ల అంగీ దొర, సొనాగట్టాడు దొరో..." అంది ఓ రోజు. నవ్వొచ్చింది నాకు. ఎవరని అడిగితే, ఆ ప్లీడరు ఎలా ఉంటాడో గుర్తులు చెప్పింది... నాకుతెలుసు. పున్ని కేస్ తీసుకున్న ప్లీడరు. శాస్త్రి గట్టి పిండమే. పున్ని కేసు గెలిపించటం అతనికి పెద్ద పనికాదు.

"ఆ తర్వాత వాయిదాల వొత్తిడి ఎక్కువవటంవల్ల అక్కడే మకాం పెట్టింది" రామారావు ఆగాడు.

అది నేరం అనే ప్రత్యేక దృష్టి చాలామందికి చాలా విషయాల మీద లేదు. బ్రతుకు గడపటానికి చాలా నేరాలు జీవితంలో భాగమైపోయాయి. అది నేరం అని తెలియక రోజూ చేసే చాలా పనుల్లాంటిదే అనుకుని నేరాలు చేసేవాళ్ళు చాలామందున్నారు. వాళ్ళల్లోదే పున్ని కూడా అనిపించింది నాకు. రామారావు అలా చెపుతుంటే పున్ని అమాయకత్వమే నన్ను బలంగా పట్టుకుంది.

"సరిగ్గా నాలుగు రోజుల క్రితమే వొచ్చింది పాకలో ఉన్న తన సామానంతా తీసుకుపోవటానికి. ఇంక అక్కడే నిజామాబాద్‌లో ఉండి పోతుందట. అంతా చిత్రంగా జరిగింది తన విషయం. కేస్ తీసుకోటానికి నాలుగొందలడిగాడట శాస్త్రి. మరి బతిమాలిందో, ఏం చేసిందో ఒంటరి ఆడది. కోర్టు పనులు అలాగే నెగ్గుకొచ్చింది. శాస్త్రి కేస్ గెలిపించాడు. యాభయ్యో పడిలో పడుతున్నా వ్యామోహం చావలేదు శాస్త్రికి. పున్నిని వొప్పించాడు తనతో ఉండిపోవటానికి. ఇక శాస్త్రి దగ్గరే ఉండిపోతానని వెళ్ళిపోయింది" అన్నాడు రామారావు చాలా తాపీగా ఇంకో సిగరెట్టు తీస్తూ. అలా చెబుతున్నప్పుడు అతని గొంతులో ఏమాత్రం బాధా వినిపించలేదు నాకు.

పున్ని అందాన్ని అలా ఆకాశానికెత్తి తను నలుగురికి కల్లు పోస్తూ జీవితం గడిపితేనే.... ఆ అందానికి అవమానం జరుగుతోందని బాధపడ్డ రామారావు, పున్ని ఉంపుడు కత్తెగా మారిపోయినందుకు ఏం బాధపడటం లేదంటే నాకు ఆశ్చర్యం వేసింది. కోపం వచ్చింది. నేనడిగితే నవ్వాడు ముందు.

"ఏ ఆడదీ ఉంపుడుకత్తెగా ఉండటానికి సంతోషంగా ఒప్పుకోదు. జీవితం వొప్పిస్తుంది. అంత రక్షణగా జామీను ఇచ్చి ఇంటికి తెచ్చిన పటేలు చెయ్యి వెయ్యబోయాడట ఆ రాత్రి. వొద్దన్నందుకు మర్నాటి నించి మాట సాయం కూడా చెయ్యలేదు. తనకి అండగా ఉండి కోర్టు గొడవల్లోంచి బైటికి లాగిన ప్లీడరే మంచివాడంటుంది తను. ఇలా మనుషుల్ని చంపే కల్తీ వ్యాపారం కన్నా శాస్త్రి దగ్గర ఉండటమే బాగుందంది. దొరికిన అవకాశ బలంతో శాస్త్రి తనని లోబరచుకున్నాడని, అతని వ్యామోహానికి తనని ఉంపుడుకత్తెగా మారుస్తున్నాడని పున్నికి తెలియదు. ప్రస్తుతం అతని దగ్గర ఉండటమే మంచిదని తన ఉద్దేశం. దానికన్నా మంచి ఏమిటి అన్న తెలివి ఇంకా రాలేదు పున్నికి.

"అదంతా నిజమే. కాని పున్ని అలా అయినందుకు నీకు కొంచెం కూడా బాధా.... సానుభూతీ...' ' ఇంకా నా మాట పూర్తి కాలేదు.

"పున్ని గురించి నేనేడ్చి.... నా గురించి నువ్వేడ్చి, నీ గురించి ఇంకోరేడ్చినంత మాత్రంలోవొరిగేదేం లేదు. ఈ ఉట్టిమాటల్తో, సానుభూతితో జీవితాలు బాగుపడవు.

మనిషిని మనిషి దోచుకోవటం, ఊపిరి పీల్చటంలా మామూలైపోయింది. బలంలేని ప్రతివాడి చుట్టూ తోడేళ్ళ గుంపు. ఈ పెదాల సానుభూతి ఆ తోడేళ్ళు దాక్కునే ముసుగు.

నాకు పున్ని అలా అయినందుకు బాధ, సానుభూతి కాదు.... అసహ్యం.... ఒకదానిమీద కాదు... అన్నిటిమీద... ముఖ్యంగా నామీద నాకు.

మనిషి బాధతో, అవసరంతో కాలాలి. జీవితంలో వొదిగే వోర్పు పూర్తిగా నశించాలి. అప్పుడే బలమైన ఉద్దేశం పుట్టి ముందుకి నడిపిస్తుంది... ఇంకా నాలో లేదది... ఉంటే ఇలా ఉండేవాణ్ణి కాదు... పున్నిని అలా అవనిచ్చేవాణ్ణీ కాదు. ప్రత్యక్షంగా శాస్త్రితో, పటేల్‌తో సంబంధం లేకపోయినా నేనూమందలో వాణ్ణే. సానుభూతి చూపించే హక్కు లేదు నాకు. ఇంక పున్ని చేసిన పనంటావా?... ఇక్కడిలా కల్తీకి

అలవాటుపడిన వాళ్ళతో ఈ వ్యాపారం నలుగురుకి చెరుపు కలిగించేది. అక్కడ ఆ జీవితం తనవరకే పరిమితమైంది. పోల్చి చూస్తే అదేమంచిదనుకోవాలి. ఏమంటావు?" అన్నాడు పక్కమీదికి వొరిగిపోతూ రామారావు.

"ఏమనాలి మంచిదా? కాదా?"

• *స్వాతి మాసపత్రిక తొలి సంచిక, జూన్ 1970*

• *యుగ్‌ప్రభాగ్, 1-4-73 (హిందీ)*

• *మాతృభూమి 27-1-74 (మలయాళం), రిపబ్లిక్ డే ప్రత్యేక సంచిక*